


నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 51

# ముందు ముందు కథా సంకలనాలన్నీ సీడీలే!

**- కవన శర్మ**

వ్యంగ్య రచనలకు ప్రసిద్ధులు కవనశర్మ. ఆయన బెంగళూరులో స్థిరపడినా తెలుగు సాహిత్యాన్ని మాత్రం వదులుకో లేదు. ఉద్యోగరీత్యా ప్రొఫెసర్‌గా ప్రపంచ వ్యాప్తంగా తిరిగినా కథలు రాయడం మానుకోలేదు. ఇప్పటికే అనేక కథల సంపుటాలు, నవలలు వెలువరించారు. తెలుగు కథ ప్రస్తుతం చదవడం నుంచి వినడం లోకి మారిందని, ఇక ముందు ముందు కథా సంకలనాలన్నీ సీడీల రూపంలో వచ్చే అవకాశం ఉందంటున్న కవనశర్మగారితో ఇంటర్వ్యూ ఈ వారం..




కాళీపట్నం రామారావుతో....

### ఆ రెండేళ్ళూ నాన్నగారిని మిస్సయ్యా!

మా తాతగారు ఇంగ్లీషు ప్రొఫెసర్. వారు మద్రాసులో ఉండేవారు. నేను 23 సెప్టెంబర్ 1939న మా తాతగారింట్లో జన్మించాను. అప్పటికి మా నాన్న కందుల నాగభూషణం గారు ఆంధ్రాయూనివర్శిటీలో టీచర్‌గా ఉన్నారు. నేను మద్రాసులో పుట్టినప్పటికీ పెరిగిందీ, చదివిందీ విశాఖపట్నంలోనే! నాకు ఇద్దరు అక్కలు. నేనే ఆఖరువాడిని. నేను ఫస్ట్‌ఫారంలో ఉన్నప్పుడు మాకు కాళీపట్నం రామారావు మాస్టారు టీచర్‌గా ఉండేవారు. నేను సెకండ్‌ఫారంలో ఉండగా మా నాన్నగారు పై చదువుకోసం రెండేళ్ళపాటు (1949-51) స్వీడన్‌కు వెళ్లారు. దాంతో మా అమ్మగారు ముక్కవిల్లి భాస్కరమ్మగారు మమ్మల్ని తీసుకుని మా మాతామహుల ఇంటికి చేరింది. మేం ఆ రెండేళ్ళూ మద్రాసులోనే ఉన్నాం. ఆ సందర్భంలో నాన్నగారిని చాలా మిస్సయ్యేవాడిని. ఏదో నాకు తోచింది సుద్దముక్కతో నేలపైన గానీ, పెన్సిల్‌తో కాగితంపైన గాని రాసుకుంటూ వెళ్ళేవాణ్ణి. బహుశా నాలో ఉన్న అలజడీ, బాధ అలా బయటకు వచ్చాయేమో అనిపిస్తుంది. నేను ఫోర్త్‌ఫారంలో ఉన్నప్పుడు కాళీపట్నం రామారావు మాస్టారితో పాటు నా సమకాలికులు శ్రీపాద వెంకటాచలం, కాశీభట్ల పార్థసారధి కూడా ఆంధ్రపత్రికలో కథలు రాసేవారు. వాళ్ళతో కలసి శ్రీశ్రీ పద్యాలు గట్టిగా అరచుకుంటూ వీధుల్లో తిరగడం, ముళ్ళపూడి 'రెండుజళ్ళ సీతలు' గురించి కబుర్లు చెప్పుకోవటం.. అదొక సాహిత్య వాతావరణం చిన్నప్పుడు నాచుట్టూ ఉండేది.

### విశాఖతో ఎంతో అనుబంధం

స్కూలు, కాలేజీ రోజుల్లో క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్ ఆడేవాణ్ణి. తరువాత టేబుల్ టెన్నిస్ ఆడేవాణ్ణి. ఐఐటి ఖరగ్‌పూర్‌లో చదివాను. ఆ తర్వాత ఆంధ్రాయూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేశాను. మా నాన్నగారు పనిచేయడం, నేను చదవటం, ఉద్యోగం చేయటం ఇలా మూడు రకాలుగా ఆంధ్రాయూనివర్శిటీతో నాకు అనుబంధం ఉంది. 2000లో మిలీనియం అవార్డు ఢిల్లీలో ఇస్తామంటే అక్కడకు వెళ్ళలేదు. ఆంధ్రాయూనివర్శిటీ వాళ్ళు శాలువ కప్పుతామంటే విశాఖకు వెళ్ళాను. విశాఖ అన్నా ఆంధ్రాయూనివర్శిటీ అన్నా అంత ఇష్టం నాకు.

### విపరీతంగా పుస్తకాలు చదివాను

నేను సాహిత్యం పట్ల ఆకర్షితుణ్ణి కావటానికి కారణం విశ్వనాథ శాస్త్రిగారనే తెలుగు మాస్టారు. జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి రచనల్ని ఉద్వేగంగా మా మాస్టారు పరిచయం చేశారు. ఆయన మాకు పాఠాలు బోధించిన పద్ధతి మనసుకు హత్తుకుంది. టౌన్‌హాల్ లైబ్రరీలో విశ్వనాథవారి వేయిపడగలు తప్ప ఎన్నో గొప్ప పుస్తకాలను చదివేశాను. భీమవరంలో మా తాతగారు ఒకాయన పెండ్యాల విశ్వనాథశాస్త్రి గారుండేవారు. వారి ఇంట్లోనే ఊరి లైబ్రరీ ఉండేది. అవన్నీ చదివాను. విశాఖలో డిటెక్టివ్ పుస్తకాల్ని మార్పిడి పద్ధతిలో చదివాను. అలా ఆరేడు తరగతుల్లో ఉండగానే విపరీతంగా పుస్తకాలు చదివాను. నాకు పద్దెనిమిదేళ్ళ వయసులో నా కోసం మా ఇంట్లో 'చందమామ' పుస్తకం కొనటం గొప్ప విషయం. ఆంధ్రపత్రిక కొనటం కూడా తర్వాత అలవాటయింది.

### 'శర్మా ఇదేం కథా?' అంది

మొదట నాటకాలు రాశాను. అవి ఎందులోనూ అచ్చుకాలేదు. నా మొదటి కథ 'పిల్లి మెడలో గంట' 1953లో ఆంధ్రపత్రికలో అచ్చయింది. కారా మాస్టారు దాన్ని చదివి 'బాగుంది.. రాస్తూ ఉండు' అన్నారు. కాలేజీ మ్యాగజైన్లో 'మాతృసేవ' అని రాశాను. నిడదవోలు మాలతి మా క్లాస్ మేట్. 'శర్మా ఇదేం కథా?' అంది. ఆ రోజుల్లో మా క్లాస్‌మేట్స్‌లో చాలామంది రచనలు చేసేవాళ్ళు? గొల్లపూడి మారుతీరావు, నిడదవోలు మాలతి, పార్థసారధి అప్పటికే ప్రసిద్ధ రచయితలు. తర్వాత నేను బెంగళూరు వచ్చేశాను.

### పది యూనివర్శిటీల్లో పనిచేశాను

1962లో పిహెచ్‌డి చేయడానికి బెంగళూరుకు వచ్చి ఇక్కడే ప్రొఫెసర్ అయి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. ఇక్కడ రీసెర్చిలో చేరడం పెళ్ళి చేసుకోవడం ఒకేసారి జరిగింది. ఇంజనీర్‌గా, సైంటిస్ట్ ఇంజనీర్‌గా, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు చాలా వాటికి కన్సల్టెంట్‌గా ఉండి వాటిని రూపొందించాను. బెంగళూరులో ఉన్న మూడు ప్రాజెక్టులు నేనే డిజైన్ చేశాను. దాదాపు పది యూనివర్శిటీల్లో పని చేశాను. ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశంలోనూ, ఆఫ్రికాలాంటి బాగా వెనుకబడిన దేశంలోను పనిచేశాను.

### లోతుగా గమనించడం అలవాటయింది

నేను మానసికంగా విశాఖపట్నం వాడినే అయినా, రచయితగా చాలా రచనలు బెంగళూరులోనే చేశాను. సీరియస్ రచనలైతే కొ.కు., హాస్యం అయితే ముళ్ళపూడి వెంకటరమణ అనుకునేవాణ్ణి. వివిన మూర్తి 1984లో బెంగళూరు వచ్చాడు. కారా మాస్టారు రచనలు, వివినమూర్తితో జరిపిన చర్చలు నా రచనలపైన ప్రభావం చూపాయనే చెప్పాలి. కథల్లో చమక్కులే కాకుండా ఇంకాస్త లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందనే జ్ఞానం వివినమూర్తి వల్ల నాకు కలిగింది. వివినమూర్తి వల్ల నాకు ఇద్దరు మంచి వ్యక్తులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య, రచన శాయిగారు పరిచయం అయ్యారు.

### మా ఆవిడ యూనివర్శిటీలో నా జూనియర్

నండూరి విజయలక్ష్మి ఆంధ్రాయూనివర్శిటీలో నాకు ఒక సంవ




వల్లంపాటి వెంకటసుబ్బయ్య తదితరులతో...

త్పురం జూనియర్. వాళ్ళకీ మాకు చిన్న శాఖాభేదం ఉన్నప్పటికీ పెద్దలు ఒప్పుకున్నారు. దాంతో మా వివాహం జరిగింది. నేను హాస్యం రాసినప్పుడు మా ఆవిడ బాగా మెచ్చుకునేది. ఆహ్లాదకరమైన రచన లంటే తనకు ఇష్టం. మాకు ఇద్దరు అమ్మాయిలు. పెద్దమ్మాయి కందుల సత్యశారద ఇంగ్లీషులో రచ నలు చేస్తోంది.

## నా రచనలకు మొదటి శ్రోత మా అమ్మ

మా నాన్నగారు, వారి తల్లి, మా అమ్మ అందరూ మంచి కథలు చెప్పేవాళ్ళు. నేను రచనలు చేసినా, ఆటల్లో పాల్గొన్నా వద్దనలేదు. ఎప్పుడూ వాళ్ళు దేనికీ నిరుత్సాహపరచలేదు. పెద్దయ్యేంతవరకూ నా రచనలకు మొదటి శ్రోత మా అమ్మ. తర్వాత మొదటి పాఠకురాలు మా ఆవిడ. నన్ను బాగా ప్రోత్సహిం చిన వారు శివలెంక రాధాకృష్ణగారు. నేను రాసిం దల్లా ఆయన ప్రచురించేవారు. తర్వాత రచన శాయి గారు.

## ఆ రెండు సినిమాలకు వీరాభిమానిని

నాకు 'మాయాబజార్', 'పెద్దమనుషులు' సినిమాలు మొత్తం కంఠస్తంగా వచ్చు. 'పెద్దమనుషులు' సినిమాలోని డైలాగ్‌లు నేను వినిపించినప్పుడు ఆ సినిమా రచయిత డి.వి.నరసరాజు ఆశ్చర్యపోయారు. 'ఆకర్షణా వ్యామోహం' నవల రాసిన కవనశర్మ మీరేనా అని సంబరపడ్డారు. 'ఇంతటి వీరాభిమాని ఉన్నాడని తెలియదు' అన్నారాయన.

## రచనల్లో హాస్యానికి చిన్నచూపు

నేను మొదట్లో రాసింది హాస్యమే! హాస్యం గురించి మాట్లాడ్డానికి సాహి త్యకారులకు నామోషీ అనుకుంటా. అందుకే సభల్లో హాస్యం గురించి మాట్లాడ్డం తక్కువేమో! హాస్యం ఆరోగ్యం కలిగిస్తుంది. హాస్యం ప్రాంతానికి, కాలానికి సంబంధించినది. హాస్యం ఉన్న సినిమాలన్నీ హిట్ అవుతాయి. రచ నల్లో హాస్యానికి అవార్డులు రావు. ఎందుకో మరి! భావాలకు, చేష్టలకు సంబంధించిన హాస్యం ఆంగ్లంలోకి అనువదించవచ్చు కానీ శబ్దాలకు సంబం ధించి హాస్యాన్ని అనువదించలేం. ముళ్ళపూడిని, కొన్ని రావిశాస్త్రిగారి రచనల్ని అనువదించలేమనుకుంటా. ఆ భాష అట్లాంటి గొప్పది. సమాన పదాలు ఉండవు.

## పుస్తకాలు అమ్ముడు పోవడం లేదు

చాలామంది సంకలనాలు చూసి సంకలనాలు తయారు చేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. సంకలనాల్లోకి వచ్చినవే మంచి కథలు కావు. నా కథల గురించి మాట్లాడే సందర్భంలో చాలామంది 'ఆమె ఇల్లు', 'విడాకులు' కథల్ని మాత్రమే కోట్ చేస్తుంటారు. నేను చాలా కథలు రాశానని వాటిల్లో ఇంకా మంచి కథలు ఉంటాయని గమనించే ఓపిక వారికి ఉండదు. పిహెచ్‌డి చేసే వాళ్ళు కూడా చాలామంది మనం ఇచ్చే సమాచారంపైనే ఆధారపడిపోతారు. ఎవ్వరూ కూడా కష్టపడి చదివి ఒక రైటర్ రచనలంటే ఏమిటో చెప్పేవాళ్ళు లేరు. ఏ రచయిత పుస్తకాలూ అమ్ముడు పోవడం లేదిప్పుడు. టెక్స్ట్‌బుక్స్, గైడ్స్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ బుక్స్, మీకు ఏవైనా మానసిక సమస్యలున్నాయా? లాంటి పుస్తకాలు అమ్ముడవుతాయంతే!


## కల్చరల్ షాక్స్ తగిలాయి

ఆస్ట్రేలియా వెళ్ళి 'ఆకర్షణ వ్యామోహం' కథ రాశాను. ఇరాక్ వెళ్లి 'ఇరాక్ డైరీ' రాశాను. ఇథియోపియా గురించి రాయడానికి రెడీగా ఉన్నాను. బయ టకు వెళ్ళినప్పుడు అందరికీ కల్చరల్ షాక్స్ కొన్ని తగులుతాయి. ఆస్ట్రేలి యాలో కారు కొన్నాను. అక్కడ ఎవ్వరూ టైర్ల కింద నిమ్మకాయలు పెట్టరు. పెట్టినా ఫైన్ వేస్తారు. గణపతి పూజ ఒకసారి చేసి పూజద్ర వ్యాలు ఎక్కడ పడవెయ్యాలో అర్థం కాలేదు. ఆ తర్వాత పూజ మానేసాం. ఆస్ట్రేలియన్లందరూ వెంకటేశ్వరస్వామిని, విఘ్నేశ్వరుణ్ణి తెలుసుకో కుండానే బ్రతికేస్తుంటే మనం ఎందుకు బ్రతకలేం అనిపిస్తుంది. ఆ విధంగా విదేశాలు వెళ్ళడం వల్ల రేషనలిస్ట్, ఎథీలిస్ట్ అయ్యాననుకుంటా. వాటి మూలాలు తెలుసుకున్నాక మళ్ళీ నమ్మకాలు పోయాయి. ఎవరిష్టం వాళ్ళది అనుకున్నాను చివ రికి. అవతలి వాడిది మూఢనమ్మకమైతే మనది మంచి నమ్మకం. అంతే తేడా!

## అవసరం బట్టి మనమే మారుతాం

ఈ రోజున తెలుగు కథ హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీ పోయి వినడంలోకి వచ్చింది. రాబోయే కాలంలో చూడ్డంలోకి వస్తుందేమో! ఇంగ్లీషు నవలలు, సీడీలను కార్లల్లో పెట్టుకుని వినేస్తున్న కాలం ఇది. మనం అంతా తెలుగు భాష మాట్లాడాలి. భాషలో పదజాలం ఉంటుంది. లిపి ఉంటుంది. వ్యాకరణం ఉంటుంది. ఇవన్నీ కలిపి భాష అంటాం. ఇప్పుడున్న భాషలో పరభాషా పదాలు చాలానే ఉన్నాయి. తెలుగులో అందరికీ అర్థ మయ్యే భాష ఉన్నప్పుడు పరభాషా పదం వాడాల్సిన అవసరం లేదు. టీవీ, మైక్, సెల్‌ఫోన్ లాంటి పదాల్ని తెలుగులో కష్టపడి పదాలు కనుగొని అనాల్సిన అవసరమూ లేదు. రాన్రాను సిల్లీనెస్ పోయి సీరియస్ వస్తుంది. నాకెప్పుడు ఏం చేయాలనిపిస్తే అది చేస్తాను. ఎప్పుడేది చదవాలినిపిస్తే అది చదువుతాను. నా రచనల వల్ల ప్రయోజనం ఏమిటా అంటే జవాబును కాలానికి వదిలేస్తాను. పాతవి తప్పనుకున్నవి ఈ రోజు ఒప్పవుతున్నాయి. ఇప్పుడు ఐడియాస్ కోసం సైన్స్ వేదాంతం వేపు చూస్తోంది. ఎప్పుడైనా మానవాళికి పనికివచ్చేది తీసు కుంటాం. పనికిరాని దాన్ని వదిలిపెడతాం. ఇవ్వాళ మనం పనికిరాదనుకొని వదిలేసిందే రేపటికి పనికిరావచ్చు. కాబట్టి ఇదొక నిరంతర ప్రవాహం. మను షులు మారుతూ ఉంటారు. అవసరం బట్టి మనమే మారుతాం. ప్రవాహంతో బాటు మనం వెడుతూ ఉంటాం. అంతే!

**-పలమనేరు బాలాజి**



భార్య విజయలక్ష్మితో...

## నచ్చినవి


| | | |
|---|---|---|
| ప్రదేశం | : | విశాఖ |
| సినిమా | : | మాయాబజార్ |
| పాట | : | నాకు పాటలు పెద్దగా నచ్చవు. పద్యాలు నచ్చు తాయి. మాధవపెద్ది సత్యం పాడిన పద్యాలంటే ఇష్టం |
| స్నేహితులు | : | చాలామందే ఉన్నారు |
| నవలలు | : | సీరియస్ నవలలన్నీ ఇష్టమే! |
| ఇంగ్లీషు కథకుడు | : | ఉడ్‌హౌస్ |
| తెలుగులో | : | రావిశాస్త్రి |
| వంట | : | గుత్తివంకాయ కూర |

**నాకు నచ్చిన నా కథ**

# త్వరగా త్వరత్వరగా

- కవన శర్మ

సాయంత్రం ఆరున్నర గంటలైంది. చీకటి మొదలవుతూంది. ''చీకటిపడే వరకు బయట తిరక్క! పురుగూపుట్ర ఉంటుంది'' అంటుంది మామ్మ. ''ఉద్యోగం లేకపోయినా తిరుగుళ్ళకి తక్కువలేదు. త్వరగా ఇంటికి దయచెయ్యి!'' అంటాడు నాన్న. ''నువ్వాలస్యం చేస్తే, నా పని అర్ధరాత్రి వరకు తెమలదు. త్వరగా వచ్చేయి బాబూ!'' అని బతిమాలుతుంది అమ్మ. నిజానికి నేను త్వరగా ఇంటికివెళ్ళి త్వరగా భోజనం చేశాక తీరుబడిగా తోచక చావాలి! ''అన్నం నాకు మూత పెట్టెయ్యమ్మా!'' అంటే అమ్మకి నచ్చదు. ''అందరిదీ తలోదారైతే ఎలారా?'' అంటుంది. ఏడుగంటలైనప్పటి నుంచి మామ్మ - ''వీడింకా రాలేదేమ్రా!'' అంటూ ఇంట్లో అందరిని హడలుగొడుతూ ఉంటుంది మామ్మ. అల్లా అన్నప్పుడల్లా - ''ఎందుకేమిటి? బుద్ధిలేక'' అని జవాబిస్తూనే ఉంటాడు నాన్న. ఇవన్నీ తప్పించుకోవాలంటే నేను ఏడు లోపల ఇంటికి చేరుకోవాలి. అందు కని చెరువుదగ్గర సిగరెట్లు కాలుస్తున్న మిత్రబృందం నుంచి సెలవు తీసుకున్నాను. నా తొందర వాళ్ళకి తెలుసు.



ఇంటికి చేరుకునేసరికి అమ్మ, అక్కయ్య పిల్లలకి అన్నం పెడుతూంది. ''అలా ఈలిగిలపడి భోజనం చెయ్యకండి. కాళ్లు కడుక్కుని ఆ తడి ఆరే లోపల అన్నం తిని లేవాలి. లేకపోతే దరిద్రం'' అని అమ్మ పిల్లల్ని కసురుకుంటూ తొందర పెడుతూంది. ''మరేమో, అమ్మమ్మా! అన్నం నమిలి, నెమ్మదిగా తినాలి అని చెప్పారు మా సైన్సు మేస్టారు'' అన్నాడు మేనల్లుడు ధైర్యం చేసి. ''కబుర్లు కట్టి పెట్టి త్వరగా భోజనం చెయ్యి!'' అంటూ రంగంలోకి వచ్చింది మా అక్కయ్య. అది పురుడు పోసుకోడానికి వచ్చింది. కనేపిల్లల్ని త్వరగా కనేస్తే వాళ్లు త్వరగా చేతికంది వస్తారని మా బావ ఉద్దేశం.

నాకు, అన్నయ్యకి, నాన్నకి, అక్కయ్యకి వడ్డించింది అమ్మ. నాన్న అమ్మ అన్నం తెచ్చే లోపల కూర, నెయ్యి తెచ్చే లోపల అన్నం తినేస్తూ, ''త్వరగా వడ్డించి చావవు'' అంటూ విసుక్కుంటూ భోజనం చేస్తున్నాడు. అమ్మకోపం వదినమీదకి తిరిగింది. ''ఆ మహారాణి పుట్టింట్లో కూర్చుంది. దాన్ని త్వరగా రమ్మన్రా! పనితో చస్తున్నాను అంటే పెద్దాడు వినిపించుకోడు'' అంది అమ్మ. ''మొన్ననే కదమ్మా అది వెళ్ళింది'' అన్నాడు అన్నయ్య తలవంచుకుని. అమ్మ మాట్లాడలేదు. నిజానికి వదినంటే అమ్మకి పుట్టెడు సానుభూతి. మా ఇంట్లో అన్నింటికి ఉరుకులు, పరుగులు. ఎందుకో, ఎక్కడికో ఎవరికీ తెలియదు. మా వదిన ఉంటే, వదిన పనిచేస్తుంటే అమ్మ హైరానా పడుతుంది. వదిన లేకపోతే, పనీ హైరానా కూడా మా అమ్మవంతే. ఎక్కడికైనా వెళ్ళి రెండు



# మనిషి పడే తొందరే..

మనం ప్రతి దానికీ కంగారు పడుతూ ఉంటాం. పుట్టుక నుండి చావు వరకూ.. అన్నిటికీ. మనం దేని వెంట పరుగెడుతున్నాం? అయితే అన్నీ నిముషం తేడాతో సజావుగా జరిగిపోతాయి. మా నాన్నమ్మ రోజూ ఉదయం నాలుగున్నరకే లేచి హైరానా పడేది. ప్రతి దశలోనూ మనిషి పడే తొందర ఏపాటిదో ఈ కథలో చెప్పాను.

–కవనశర్మ
***09448113195***

రోజులు విశ్రాంతి తీసుకోవాలనుకుంటుంది. ''ఎక్కడికో ఎందుకు? హాయిగా మనింట్లోనే ఏదీ కల్పించుకోకుండా విశ్రాంతిగా ఉండరాదా?'' అంటాను నేను. ''ఎల్లా వీలవుతుంది?'' అంటుంది. అమ్మ వీలుచేసుకోదు. కనీసం వదినైనా రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటుందని అమ్మే వదినని పంపించింది. రేపె లాగూ వస్తుంది వదిన. వదిన త్వరగా రావటం అంటే సాయంత్రం బండిలో కాకుండా పొద్దున్న బండిలోనే రమ్మని అన్నయ్య వదినతో గట్టిగా చెప్పాడో లేదో అని అమ్మభయం.

అన్నాలు తిన్నాక, అక్కయ్య పిల్లలకి పక్కలు వేసి, ''అల్లరి చెయ్యకుండా త్వరగా పడుకోండి. లేకపోతే తాతయ్యకి కోపం వస్తుంది'' అంటూ పిల్లల్ని పడుకోబెట్టింది. నాన్న నన్ను పిలిచాడు.

''త్వరగా ఏదో ఒక ఉద్యోగంలో చేరు! నా బాధ్యతలు తీరితే తీరుబడిగా కృష్ణా రామా అనుకుంటాను. ఎన్నాళ్ళిలా అడ్డగాడిదలా చెరువుగట్ల తిరుగుతావు!'' అంటూ రోజూ రాత్రి ఇచ్చే ఉపన్యాసం మొదలుపెట్టాడు. నాకు ఏవో రెండు ఉద్యోగాల ఆఫర్స్ ఉన్నాయి. చేరటానికి ఇంకో నెల టైముంది. జీవితంలో ఇవే నా చివరి సెలవులు అందుకని, చివరి గడువు రోజున తప్ప నేను ఉద్యోగంలో చేరదలుచుకోలేదు. నాన్న మళ్ళీ మొదలుపెట్టాడు. ''మా నాన్నకి, మీ అమ్మ తండ్రికి ఒకేసారి డెప్టీ తాసీల్దారు ఉద్యోగాలు అయ్యాయి. మా నాన్న పొద్దున్నే వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. మా మామగారు భోజనం చేసి వర్జ్యం పోయాక చేరాడు. దానికి మా నాన్నగారు మా మామగారికి జీవితాంతం సీనియర్ అయ్యాడు. అందుకని మా నాన్న తాసీల్దారుగా రిటైరైతే మా మామగారు డెప్టీగానే రిటైరయ్యారు. సీనియారిటీ పోతుంది, త్వరగా వెళ్ళి చేరు!'' అంటూ చెప్పాడు. ఆయన మాట నిజమే. కాని, ఈ రోజుల్లో ప్రమోషన్లు రావాలంటే సీనియారిటీ చాలదు.

''వాడు త్వరగా ఉద్యోగంలో చేరడు. నువ్వు వాడికి త్వరగా పెళ్ళిచెయ్యవు'' అంటూ మామ్మ, నాన్నతో యుద్ధానికి దిగింది. ''వాడు ఉద్యోగంలో చేరిన మరునాడు పెళ్ళి చేస్తాను'' అన్నాడు నాన్న. ''నా పెళ్ళికి తొందరేమిటి, మామ్మా! నాకిప్పుడు ఇరవై రెండేళ్ళేగా'' అన్నాను. ''ఏ వయస్సులో ముచ్చట ఆ వయస్సులో జరగాలి. ఇరవై రెండేగా అంటే నలభై రెండు వచ్చాక చేసుకుంటావా? మీ తాతకి ఈ వయస్సులో మీ నాన్నకి రెండేళ్ళ వయస్సు. మీ నాన్నకీ వయసులో నువ్వు పుట్టావు. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా... అవి ఊరికే అన్నారా? అయినా, నీ కడుపునో కాయ త్వరగా కాస్తే. నేను చూసి చద్దామని. మీకు మీ ఇష్టాయిష్టాలే గాని. మావి పట్టవు'' అంది మామ్మ. ఆవిడ ఇది ప్రతి రాత్రి చెప్పే పురాణమే! ఏదో ఒక ఏడాది పాటు ఉద్యోగం చేస్తూ ఏ బాదరబంది లేకుండా సెకెండు షోలు చూస్తూ బ్రహ్మచర్యం గడపాలని. ఆ పైన మరో ఏడాదిపాటు బుద్ధిగా డబ్బు కూడబెట్టి ఆపైన పెళ్ళి చేసుకోవాలని నా కోరిక. చేతిలో డబ్బు ఉంటేనే కదా కట్టుకున్నదానికి ఓ ఏడాది పాటైనా చీరలు కొన్నా, సినిమాలు చూపించినా? ఆపై ఏడాదికి ఎంత డబ్బూ పాలడబ్బాలకి డాక్టర్లకి సరిపోదు. అంటే నేను మాత్రం ఏం పెద్ద ఆలస్యం చేస్తున్నాను. పాతిక సంవత్సరాలకి తండ్రి నవుతాననే అంటున్నాను కదా! మా మామ్మకి ఇంతాచేసి మహా ఉంటే అధిక మాసాలతో కలిపి, అరవై ఏళ్ళు! ఆవిడ అధిక మాసాలు కలుపుకొని కాని వయస్సు చెప్పదు. మరో పదేళ్ళు సులభంగా బతుకుతుంది. ఆఖరికిచావుకి కూడా త్వరపడుతుంది ఎందుకో! కళ్ళు మూసుకుని పడుకున్నాను.



వంటింట్లో చప్పుళ్ళు మొదలయ్యాయి. అంటే, మామ్మ లేచిందని, నాలుగున్నర అయిందని అర్థం. ఏవో కొంపలంటుకు పోతున్నట్టు నాలుక్కే లేచి నాలుగున్నరకి మంచి హడావిడిలో ఉంటుంది. బద్ధకంగా మంచం మీద కళ్ళు గట్టిగా మూసుకుని పడుకున్నాను. చీకట్లు విచ్చుకుంటున్నాయి. అమ్మ చీపురు, బక్కెట్టు పుచ్చుకుని, వీధి గుమ్మం మీద దాడి మొదలుపెట్టింది. ''ఈ దాసీది ఎక్కణ్ణుంచో నా ప్రాణం మీదకు వచ్చిపడింది. రోజు తెల్లారేసరికి రావే! ఇంటి యజమాని లేచే సరికి పాచిగుమ్మం ఉండరాదు అని మొత్తుకుంటూనే ఉంటాను. అది అలాగే అంటుందే కాని త్వరగా వచ్చి చావదు. దాని మొహం మండా! పైగా ఇకిలిస్తుంది'' అంటూ దండకం చదువుతూ గుమ్మాలు కడుగుతూంది. అదెల్లాగు ఇంకో అరగంటకి రానే వస్తూంది. ఈ లోపల అమ్మ చెయ్యవలసినంత హడావిడి చేస్తుంది.

అమ్మ గుమ్మాలు కడిగేసరికి నాన్న లేచి పళ్ళు తోముకున్నారు. ''పాల వెధవ వచ్చాడా!'' అంటూ ఒక్క అరుపు అరిచారు. అమ్మ నాన్నకి జవాబు చెప్పలేదు. అప్పుడే ఆలస్యంగా వచ్చిన పనిమనిషిని దులిపెయ్యటం మొదలుపెట్టింది. ''బారెడు పొద్దెక్కితే గాని పాలవాడు వచ్చి చావడు'' అని నాన్నగారు విసుక్కోవడం మొదలు పెట్టారు. వీధిలో సైకిల్ బెల్ మోగింది అంటే ఆరుగంటలైందన్న మాట. పాలవాడు వచ్చాడు. ''కాఫీలు కలిపేస్తున్నాను. లేచి మొహాలు కడుక్కోండి. నేను పదిసార్లు వేడి చెయ్యలేను. అది కూడా పుట్టింటిలో వెళ్ళి కూర్చుంది'' అంటూ అమ్మ నాకు, అన్నయ్యకి అక్కయ్యకి చివరి

గంట కొట్టేసింది. ఆరున్నర కల్లా కాఫీలు అయిపోయాయి. కాఫీలు అయీ అవగానే నీళ్ళ పొయ్యి కింద మంటచేసింది అమ్మ.

ఏడుగంటలయ్యే సరికల్లా స్నానాల హడావిడి. ''స్నానాలు చెయ్యండర్రా'' అంటూ అమ్మ గొడవ. ''నా పిల్లల స్నానాలయ్యాక గాని నేను పోసుకోవడం ఎల్లా'' అని అక్కయ్య జవాబు. ''త్వరగా కానియ్యండి. నీళ్ళు చల్లారిపోతాయి. ఆ పైన నేను మడికట్టుకోవాలి.'' అమ్మ తొందర పెడుతూంది అందర్నీ. ప్రతిరోజు త్వరగా లేచి, త్వరగా స్నానాలు చేసి త్వరగా భోజనం చేసి, త్వరగా నిద్రపోయి... అంతా తొందరే. ఎందుకో?

అమ్మ మడికట్టుకునేసరికి మామయ్య వచ్చాడు. ''బావా! ఈ నెలలో మా వరలక్ష్మికి పెళ్ళి చేసేద్దామనుకుంటున్నాను ఏమంటావు'' అంటూ సూటిగా రంగంలోకి దిగాడు. ''ఏమిటంత తొందర'' అని నాన్న తాపీగా అడిగాడు. ''ఆడపిల్ల గుండెల మీద కుంపటి. అదెంత త్వరగా దింపుకుంటే అంత సుఖం. దానికప్పుడే పదిహేడో ఏడు. నీ చెల్లెలు ఈ రోజు ఎటూ తేల్చుకురాకపోతే అన్నం వండనని భీష్మించుకు కూర్చుంది. త్వరగా నోట్ల మెతుకులు పడకపోతే, నా పనయిపోతుంది. నీకేం!'' అని నిష్ఠూరమాడాడు. మా నాన్న మా అక్కయ్య పెళ్ళి విషయంలో ఇల్లాగే తొందరపడ్డాడు. పెళ్ళయ్యాక కార్యం చేసి కాపురానికి పంపటానికి అంతకంటే తొందరపడ్డాడు. నా పెళ్ళి అందరు ఒప్పుకున్నదే. నాకు వరలక్ష్మీ అంటే చాలా ఇష్టం. కాని, త్వరగా పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. పెళ్ళయితే మావయ్య ఇప్పుడు నాకు చేసే మర్యాదలో వాళ్ళింటికి వెళితే చేసే ఆర్భాటంలో సగం చెయ్యడు. వరలక్ష్మి ఇప్పుడు పడినంత సిగ్గు అప్పుడు పడదు. అమ్మ ''అది వెళ్ళి పుట్టింట్లో కూర్చుంది'' అని వరలక్ష్మిని కూడా విసుక్కుంటుంది. కాని నా మాటకి విలువేమిటి? అందరు పెద్దవాళ్ళు చేరి ఆ నెలలో నా బ్రహ్మచర్యానికి స్వస్తి పలకటానికి నిశ్చయం చేశారు.


వీధిలో బండి ఆగింది. వదిన, పిల్లలు వచ్చారు. ''త్వరగా వచ్చి మనింట్లో పడేదాకా నాకు తోచలేదత్తయ్యా!'' అంది అమ్మతో. నాకు తెలియదుటే నీ సంగతి'' అంది అమ్మ. ''త్వరగా సాన్నం చేసి వస్తా'' అంటూ వదిన నీళ్ళ గదిలోకి వెళ్ళింది. ఇంతలో పక్కింట్లోంచి గొల్లున ఏడ్పులు వినిపించాయి. చాలా రోజులుగా మంచంలో వున్న ముసలాయన పోయినట్టున్నాడు. అమ్మ మైలపడింది. అమ్మా, నాన్నా అక్కడికి వెళ్ళారు. ఓ గంటపోయాక వచ్చారు. పెద్దకొడుకు వూళ్ళో లేడుట, టెలిగ్రామ్ ఇచ్చారుట. అతను టాక్సీ చేయించుకు రావాలిట. అంతవరకు శవం ఉంచుతారట. పన్నెండయింది. ఒంటి గంటయింది. పెద్దకొడుకు జాడలేదు. వీధిలోని అందరు చిన్నకొడుకుని కర్మ చెయ్యమన్నారు. వీధిలో శవం ఉన్నంతసేపు ఎవరిళ్ళలోను నిప్పు రాజెయ్యరాదుట. వండుకోరాదుట. తినరాదుట. ''త్వరగా శవం కదల్చక పోతే వీధంతా ఈ రోజుకి పస్తే. చిన్నపిల్లలు వాళ్ళకి ఎలా! చిన్న కొడుకుని తగలెయ్యమని గట్టిగా చెప్పండి'' అంది అమ్మ నాన్నగారితో. ఆఖరికి మనిషి చచ్చాకకూడా ఆ అంతిమ ప్రయాణం చేసేటప్పుడు కూడా ఈ తొందర తప్పదు. వీధి వాళ్ళంతా చిన్నకొడుకు చేత చితికి నిప్పు అంటింప చేశారు. నిప్పంటించిన అయిదు నిమిషాలకి పెద్దకొడుకు వచ్చాడు.

రాత్రి భోజనాలయ్యాక అక్కయ్య నొప్పిగా వుందంది. ''భయపడ్డావేమోనే'' అంది అమ్మ. నిజం నొప్పులని తేలాక నన్ను - ''మంత్రసానిని త్వరగా తీసుకురా'' అని పంపారు. రాత్రి పన్నెండయింది. అక్కయ్య నొప్పులు పడుతూంది. పురుడు కష్టమయ్యేలా వుంది. ''త్వరగా పురుడు వచ్చేటట్టు చెయ్యి తల్లీ! నీ గుళ్ళో అభిషేకం చేయిస్తాను'' అని మామ్మ దండం పెట్టుకుంటూంది. ''ఇంకో ఘడియ అయితే అష్టమి వస్తుంది'' ఆలస్యం అంటూ నాన్న హడావిడి పడుతున్నాడు. మరో పది నిమిషాల్లో అక్కయ్య కూతురు కార్ మంది. ''అమ్మయ్య త్వరగానే పురుడు వచ్చిం''దని అమ్మ నిట్టూర్చింది. పుట్టుక నుంచి పుడకలతో మండేదాకా అంతా త్వరగా, త్వరత్వరగా జరగాలి.

✻

**కథాకళి**

# వాదన.. వేదన



అబ్బా.. అబ్బా.. ఎవరు వారు? సుగ్రీవుడితో యుద్ధం చేస్తున్న నాపై చాటు నుంచి బాణం వేసింది ఎవరు? ధైర్యం ఉంటే ముందుకొచ్చి మాట్లాడండి... కిందపడిన వాలి నిలదీశాడు.

ధనుర్బాణాలు పట్టుకున్న రాముడు మెల్లిగా చెట్టు చాటు నుంచి బయటకు వచ్చాడు.

నేను అయోధ్యాధీశుడిని. రాముడిని. నేనే నీపై బాణం వేశాను. వివరించాడు రాముడు.

రామా. నీకు నాకు విరోధం ఏముంది? నాపై బాణం ఎందుకు వేశావు? అడిగాడు వాలి.

నువ్వు నీ తమ్ముడు సుగ్రీవుని భార్యను అపహరించావు. నిన్ను గెలవలేని నీ తమ్ముడు నన్ను శరణు వేడాడు. అందుకే అతని తరపున నేను నీపై బాణం వేశాను. బదులిచ్చాడు రాముడు.

నా తమ్ముడి తరపున యుద్ధం చేయాలనుకుంటే నేరుగా వచ్చి యుద్ధం చేయాలి. నువ్వు క్షత్రియుడివి కదా అమాత్రం తెలియదా? ఇలా చెట్టు చాటు నుంచి బాణం వేయడం ఏం ధర్మం? నిలదీశాడు వాలి.

సములతో మాత్రమే క్షత్రియుడు నేరుగా యుద్ధం చేస్తాడు. నువ్వు వానరుడివి. నేను నరుడిని, అందునా రాజుని. వేట నా హక్కు. వేట చాటు నుంచే చేస్తారు. అందుకే నేను నిన్ను చెట్టుచాటు నుంచి వేటాడాను సమాధానమిచ్చాడు రాముడు.

బాగా చెప్పావు. వేట ఎలా చేస్తారో తెలిసిన వాడివి, వేటిని వేటాడాలో తెలియదా? శాస్త్రం ప్రకారం... ఆహారానికి ఉపయోగపడే వాటిని, జనాన్ని నష్ట పరిచే వాటిని మాత్రమే వేటాడాలి. చతుష్పాద జంతువుల్లో కోతులను తినకూడదని, అవి ఆహారానికి పనికిరావనే నియమం ఉంది కదా! అలాంటప్పుడు నువ్వు నన్ను ఎందుకు వేటాడావు? సూటిగా ప్రశ్నించాడు వాలి.

నీ తమ్ముడి భార్యను నువ్వు అపహరించావు. దానివల్ల నీ తమ్ముడికి అన్యాయం కలిగింది. దాన్ని సరిచేయడానికే నేను నీపై బాణం వేశాను. అన్నాడు రాముడు.

అబ్బో. ఏం చెప్పావు? నువ్వే చెప్పావు కదా మన జాతులు వేరని. నువ్వు నరుడివని, నేను వానరుడినని. మా జాతిలో బలమున్న వాడే ఆడ పొందును అనుభవిస్తాడు. నాకు బలం ఉంది కనుకే నా తమ్ముడి భార్యను ఎత్తుకు వచ్చాను. మా జాతిలో ఇది తప్పేమీ కాదు. మీ జాతి నియమాలను మాకు వర్తించి న్యాయం చెబుతావేంటి? మళ్లీ అడిగాడు వాలి.

నేను రాజును. ధర్మ పరిరక్షణ, న్యాయాన్యాయ విచారణ చేయవలసింది నేను కాని, నిందితుడివైన నీవు కాదు. న్యాయం ఆలోచించే నేను ఈ పనిచేశాను. చెప్పాడు రాముడు.

రాజును, రాజును అని ఒకటికి రెండు మార్లు చెబుతున్నావు. నువ్వు అయోధ్యకు రాజువు. ఈ అడవికి కాదు. అడవి అందరిది. ఇంకా చెప్పాలంటే ఈ అడవి మాది. ఇక్కడ మా జాతికి నేను రాజును. నన్ను శాసించే హక్కు నీకు ఎక్కడిది?

అధర్మ పరులు ఏ జాతిలో ఉన్నా వారిని ఎదిరించి, వధించుట ధర్మ పరాయణుల కర్తవ్యం. అందుకే నేను ఈ పనిచేశాను. బదులిచ్చాడు రాముడు.

నీతి: రాముడు, వాలి మధ్య జరిగిన ఈ సంవాదంలో ఎవరి వాదన కరెక్టు? చెప్పగలరా? అంత తొందరగా చెప్పలేం. నిష్పాక్షికంగా ఆలోచిస్తే చెప్పడం కాస్త కష్టమే అనొచ్చు. ఇంకాస్త గట్టిగా చెప్పాలంటే ఇద్దరి వాదనా సబబే అని మనసులో ఒక మూల అనిపిస్తుంది. వాదనలో ఉన్న విశేషమే అది. వాదనలో, వాదనతో వాస్తవిక సత్యం తేలడం అసాధ్యం. వాక్చాతుర్యమే వాదనను, అంతిమ ఫలితాన్ని ప్రభావితం చేస్తుంది. అందుకే వాదులాటలతో సమయాన్ని వృథా చేయడం అవివేకం. విరోధితో వాదించడం అంటే నీ విజ్ఞానాన్ని అయాచితంగా, ఉచితంగా అతనికి పంచి పెట్టడమే. అందుకే వాదోనావలంబ్యః అని పెద్దలు ఉద్బోధించారు. వాదనతో మిగిలేది వేదనే!

**-తిగుళ్ళ కృష్ణమూర్తి**